రంగారెడ్డి | వికారాబాద్ | మేడ్చల్
వార్త



# అభివృద్ధిలో రాజకీయాలొద్దు

**ఎల్ నినో ఎఫెక్ట్‌ను సమిష్టిగా ఎదుర్కొందాం**

**ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, జెడ్పి సీఈవో కృష్ణారెడ్డి పిలుపు**


మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంకర్

**నందిగామ, జులై 30, ప్రభాతవార్త :** ఎల్‌ని నో ఎఫెక్ట్‌ను ఎదుర్కొనేందుకు రాజకీయాలు పక్కన పెట్టి అందరూ సమిష్టిగా ఎదుర్కోవాలని షాద్నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పిలుపు నిచ్చారు. గురువారం నందిగామ మండల కేంద్రంలో ఇన్చార్జి ఎంపీడీవో అరుంధతి అధ్యక్షతన జరిగిన మండల స్థాయి సమీక్ష సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవితాలను చిన్నాభిన్నం చేసిన కరోనా కంటే ఎల్‌ని నో ఎఫెక్ట్ ప్రమాదకరమన్నారు. దీనివల్ల వ్యవసాయం, ఆర్టికల్చర్, ఎలక్ట్రిసిటీ, మంచినీటిపై ప్రభావం పడుతుందన్నారు. రైతులు వర్షాధార పంటలపై కాకుండా ప్రత్యామ్నాయ పంటలను వేసుకోవాలని ప్రజా ప్రతినిధులు, అన్ని శాఖల అధికారులు, ఎప్పటికప్పుడు ప్రజలను అప్రమత్తం చేయాలని సూచించారు. సర్పంచులు సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలని, ఏవైనా సమస్యలుంటే తన దృష్టికి తేవాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజల సంక్షేమం కోసం ప్రజా పాలన, ప్రగతి ప్రణాళిక ద్వార పల్లెల ప్రగతికి పెద్దపీట వేసిందన్నారు. జిల్లా సీఈవో సిహెచ్ కృష్ణారెడ్డి మాట్లాడుతూ చెత్త రాజీ పడొద్దని, జలసిరి, శానిటేషన్, వన మహోత్సవం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. గ్రామ పంచాయతీ ద్వార సొంత వనరులను సద్వినియోగం చేసుకుంటే గ్రామాలు మరింత పురోగతి సాధించడానికి అవకాశం ఉంటుందన్నారు. సమావేశంలో మిషన్ భగీరథ, విద్యుత్ సమస్యలపై >>2


అభివృద్ధి పనుల శంకుస్థాపన శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

## రూ.76.46 కోట్లతో స్టార్మ్ వాటర్ డ్రైన్లు

**అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన మంత్రి శ్రీధర్ బాబు**

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, జులై 30, ప్రభాత వార్త :** ఉప్పల్ నియోజకవర్గాన్ని మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దడమే లక్ష్యం గా తెలంగాణ ప్రభుత్వం అడుగులు వేస్తోంది. అందులో భాగంగా ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు మేడ్చలల్‌జిల్లా ఉప్పల్ పరిధిలో రూ.76.46 కోట్ల అంచనా వ్యయంతో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. రామంతాపూర్ భాగాయత్, చెర్లపల్లి, చిలకనగర్ బీరప్పగడ్డ ప్రాంతాల్లో రోడ్ల నిర్మాణం, వర్షపు నీటి పారుదల (స్టార్మ్ వాటర్) డ్రైన్ల వ్యవస్థ బలోపేతం, ఫుట్‌పాత్‌లు మరియు స్పోర్ట్స్ అరేనాల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. నాణ్యమైన పట్టణ మౌలిక వసతులు, డ్రైనేజీ సమస్యలకు శాశ్వత పరిష్కారం అందించడమే ప్రభుత్వ ధ్యేయమని తెలిపారు.

# ఆహా! వచ్చిందయ్యా భరోసా

**విస్తారంగా కురుస్తున్న వానలతో నిండిన ప్రాజెక్టులు**

**✦జీవం పోసుకుంటున్న పునాస పంటలు**
**✦యాసంగికీ ధీమా ✦రైతుల్లో ఉప్పొంగిన ఆశలు**
**✦20 అడుగులకు చేరిన కోటపల్లి నీటిమట్టం**

గడిచిన రెండు నెలలుగా వర్షాభావ పరిస్థితులతో దిగులు పడిన రైతాంగానికి ఉపశమనం లభించింది. గత మూడు రోజులుగా జిల్లా వ్యాప్తంగా కురుస్తున్న భారీ వర్షాలతో ఎండిపోయిన పునాస పంటలకు జీవం పోసినట్లయింది. వాయుగుండం ప్రభావంతో వర్షాలు విస్తారంగా పడటంతో జిల్లాలోని కోటపల్లి, నందివాగు, సర్పన్‌పల్లి, లఖ్నాపూర్ వంటి ప్రాజెక్టులతో పాటు చెక్ డ్యామ్‌లకు కూడా భారీగా వరద నీరు చేరుతోంది. దీంతో సాగునీటి కొరత తీరి, రాబోయే యాసంగి పంటలకు మెండుగా భరోసా లభించిందని వ్యవసాయాధికారులు, రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

**ప్రభాతవార్త, వికారాబాద్ జిల్లా ప్రతినిధి :** రెండు నెలలుగా కళ తప్పిన రైతుల మొహాలు ఒక్కసారిగా వెలిగిపోయాయి. మూడురోజులుగా జిల్లా అంతటా భారీ వర్షాలు పడుతున్నాయి. ఎల్‌నినో ప్రభావంతో వర్షాల జాడ లేక పునాస పంటలపై ఆశలు వదులుకున్న రైతున్నలకు యాసంగి భరోసా పెరిగింది. వాయుగుండం కారణంగా ఆదివారం నుంచి తెలంగాణలో విస్తారంగా వర్షాలు పడుతున్నాయి. రెండు రోజులుగా కురిసిన భారీ వర్షాలకు జిల్లాలో జలాశయాలకు భారీగా వరదనీరు చేరింది. ఆశలు వదులుకున్న పునాస పంటలకు జీవం పొసినట్లయింది. పత్తి, కంది, వరి ధాన్యం పంటలకు మేలు చేకూరుతుందని వ్యవసాయశాస్త్రవేత్తలు అంటున్నారు. జిల్లాలో ఉన్న 4.5 లక్షల ఎకరాల వ్యవసాయ భూములు ఉండగా ఇంకా లక్షన్నర ఎకరాలు సాగుకు దూరంగా ఉన్నాయి. సకాలంలో వానలు కురియనందున విత్తనాలు వేసుకోలేదు. పలు గ్రామాలలో ఇంకా విత్తనాలు వేసుకునేందుకు అనువైన వాతావరణం ఉందని అధికారులు చెబుతున్నారు. ఈ క్రమంలో ఊహించని విధంగా వర్షాలు కురియడంతో జిల్లాలోని మధ్యతరహా ప్రాజెక్టులకు భారీగా నీరు చేరింది. యాసంగిలో వరి, వేరుశనగ, శనగ, జొన్న >>2


ఓవర్‌ఫ్లో అవుతున్న కాగ్నా నదిపై చెక్‌డ్యామ్
పూర్తిస్థాయి నీటి మట్టానికి చేరువలో కోటపల్లి ప్రాజెక్టు


వెట్టి చాకిరి విముక్తి గీతం సిడీని ఆవిష్కరిస్తున్న తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవల సంస్థ (టిఎస్ఎల్ఎస్ఎ) మెంబర్ సెక్రటరీ పంచాక్షరి, నల్సార్ విసి శ్రీకృష్ణదేవరావు, ఐజెఎం జాతీయ డైరెక్టర్ మెర్లిన్ ఫ్రీడా తదితరులు

## ఊరూరా స్వేచ్ఛా రథం

**వెట్టి చాకిరీపై పోరాటానికి రాష్ట్ర న్యాయ సేవల సంస్థ బృందం ప్రణాళిక**

**గ్రామస్థాయిలో చైతన్యమే ప్రధాన ఉద్దేశం**

**33 జిల్లాలోనూ పర్యటనకు ఏర్పాట్లు**

**శామీర్‌పేట, (మేడ్చల్ జిల్లా ప్రతినిధి), జులై 30, ప్రభాతవార్త :** వెట్టిచాకిరి నిర్మూలన చట్టం తెచ్చి 50 సంవత్సరాలు పూర్తయినప్పటికీ, నేటికీ తెలంగాణలోని కొన్ని జిల్లాల్లో ఈ వ్యవస్థ కొనసాగుతుండటం తీవ్ర ఆందోళనకరమని తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవల సంస్థ మెంబర్ సెక్రటరీ సిహెచ్ పంచాక్షరి ఆవేదన వ్యక్తంచేశారు. గురువారం శామీర్‌పేటలోని నల్సార్ లా యూనివర్సిటీలో తెలంగాణ ప్రభుత్వం, నల్సార్ లా యూనివర్సిటీ, ఐజెఎం స్వచ్ఛంద సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో బంధిత కార్మిక వ్యవస్థ నిర్మూలనపై ఒక రోజు రాష్ట్ర స్థాయి సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాక్షరితోపాటు నల్సార్ లా యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ శ్రీకృష్ణదేవరావు కలిసి స్వేఛ్చా రథం అనే మొబైల్ అవగాహన వాహనాన్ని ప్రారంభించారు. ఈ వాహనం రాష్ట్రంలోని 33 జిల్లాల్లో పర్యటిస్తూ, బంధిత కార్మిక వ్యవస్థపై ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు ప్రభుత్వ సేవలపై నమ్మకాన్ని పెంపొందిస్తుందని వివరించారు. సీఎం రేవంత్ రెడ్డి ఆకాంక్షి ంచిన తెలంగాణ రైజింగ్ 2047 విజన్‌కు అనుగుణంగా, రాష్ట్రంలో ఆధునిక బానిసత్వానికి స్థానం లేకుండా చేయడమే ఈ రథం యొక్క ముఖ్య ఉద్దేశమని వెల్లడించారు.

మానవ అక్రమ రవాణా, వెట్టిచాకిరి అనేవి కేవలం చట్టపరమైన అంశాలే కాకుండా మానవ గౌరవానికి, రాజ్యాంగ విలువలకు సంబంధించినవని పంచాక్షరి పేర్కొన్నారు. పోలీసు, రెవెన్యూ, కార్మిక, మహిళా శిశు సంక్షేమ శాఖలు ఉమ్మడిగా పనిచేయాలని కోరారు. నల్సార్ జుది శ్రీకృష్ణదేవరావు మాట్లాడుతూ బాధితులకు కేవలం రక్షణ మాత్రమే సరిపోదని, వారి జీవితాలకు స్థిరమైన జీవనోపాధి >>2

## హాజపూర్‌లో నకిలీ ఎరువుల దందా

**43 డిఏపి బస్తాలు స్వాధీనం -నిందితులపై కేసు నమోదు**



**యాలాల, జులై 30, ప్రభాతవార్త :** యాలాల మండలం హాజపూర్ గ్రామంలో నకిలీ ఎరువుల విక్రయాలపై వ్యవసాయ, పోలీసు అధికారులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో సుమారు 43 బస్తాల నకిలీ డిఎపి బస్తాలను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని హాజీపూర్ గ్రామంలో నకిలీ డిఎపి విక్రయిస్తున్నారనే విశ్వసనీయ సమాచారం మేరకు గురువారం మండల వ్యవసాయ అధికారిణి స్వేత, పోలీసుల ఉమ్మడిగా దాడులు నిర్వహించారు.గ్రామానికి చెందిన రాచూరి ఆశన్న,శంకరి బిచ్చప్ప ఇండ్లల్లో అక్రమంగా నకిలీ డిఎపి బస్తాలను గుర్తించి స్వాదీనం చేసుకున్నారు. నకిలీ డిఎపి విక్రయిస్తున్న బిచ్చప్ప, ఆశన్నలపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ విఠల్‌రెడ్డి తెలిపారు.మండలంలో ఎవరైనా నకిలీ విత్తనాలు, ఎరువులు విక్రయిస్తే సమాచారం ఇవ్వాలని ఎఒ శ్వేతరాణి, ఎస్ఐ విఠల్‌రెడ్డి కోరారు. రైతులు ఎరువులు విత్తనాలు కొనుగోలులో అప్రమత్తంగా ఉండాలని వారు సూచించారు.

## విద్యార్థుల ఆరోగ్యంపై దృష్టి సారించండి

**జిల్లా వైద్య,ఆరోగ్యశాఖ అధికారి ఆనంద్ ఆదేశం**

**శామీర్‌పేట, (మేడ్చల్ జిల్లా ప్రతినిధి), జులై 30, ప్రభాతవార్త :** విద్యార్థుల ఆరోగ్యం, సంక్షేమంపై సంబంధిత అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని, పోషకాహార విలువలతో కూడిన బోజనాన్ని అందించాలని, పరిశుభ్రత ప్రమాణాలను పాటించాలని మేడ్చల్ జిల్లా వైద్య,ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కె.ఆనంద్ ఆదేశించారు. గురువారం మేడ్చల్ జిల్లా >>2

# కనురెప్పే కాటేసింది

**కన్నకూతురిపైనే కీచక పర్వం!**

**మైనర్ బాలికకు అశ్లీల వీడియోలు చూపిస్తూ లైంగిక దాడి..**

**కడుపునొప్పితో వెలుగుచూసిన కామ పిశాచి పాపం..**

**వికారాబాద్‌లో దారుణం, నిందితుడి అరెస్ట్**

**ఫోక్సో చట్టం కింద కేసు నమోదు**

**వికారాబాద్, ప్రభాతవార్త :** కంటికి రెప్పలా కాపాడాల్సిన కన్న తండ్రి కన్న కూతురిపై ఆఘాయత్యానికి పాల్పడ్డాడు. మైనర్ బాలికకు అశ్లీల చిత్రాలు చూపిస్తూ పలుమార్లు లైంగిక దాడికి పాల్పడిన సంఘటన వికారాబాద్ జిల్లాలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వికారాబాద్ పోలీసుల కథనం ప్రకారం.. నారాయణ ఖేడ్‌కు చెందిన నిందితుడు జగన్నాథ్ సుమారు 20 సంవత్సరాల క్రితం వికారాబాద్‌కు వచ్చి ఆటో డ్రైవర్‌గా జీవనం కొనసాగిస్తున్నాడు. ఇద్దరు భార్యలు ఉన్నారు. మొదటి భార్యకు ఒక కుమారుడు, కుమార్తె కాగా, రెండో భార్యకు ముగ్గురు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. రెండో భార్య ఈ మధ్యనే మరణించడంతో హాస్టల్‌లో ఉన్న పిల్లలను సెలవు రోజుల్లో ఇంటికి తీసుకువచ్చేవాడు. ఆ సమయంలో 14 ఏళ్ల మూడో కుమార్తెకు మాయమాటలు చెప్పి, ఫోన్లో అశ్లీల చిత్రాలు చూపి పలుమార్లు బలవంతంగా అత్యాచారానికి పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. హాస్టల్‌లో ఉంటున్న బాలికకు ఈ నెల 27న కడుపునొప్పి రావడంతో ఉపాధ్యాయులకు విషయాన్ని తెలియజేసింది. ప్రిన్సిపాల్ బాలికను వైద్య పరీక్షలకు పంపగా.. ఆమె లైంగిక దాడికి గురైనట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ విషయాన్ని చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ఫిర్యాదు చేసి భరోసా కేంద్రానికి బాధితురాలిని తరలించారు. ఈనెల 27న బాధితురాలి తండ్రిపై వికారాబాద్ పోలీసులు కేసు నమోదు చేశారు. విషయం తెలుసుకున్న జగన్నాథ్ పరారీలో ఉండటంతో, ప్రత్యేక పోలీస్ బృందాన్ని ఏర్పాటు చేసి గాలింపు చర్యలు చేపట్టారు. నిందితుడు గురువారం ఇంటికి వచ్చినట్లు సమాచారం అందడంతో, పోలీసు బృందం అక్కడికి చేరుకుని అదుపులోకి తీసుకుని అరెస్ట్ చేశారు. ఫోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి తరలించినట్లు వికారాబాద్ సీఐ రఘుకుమార్ తెలిపారు.


నిందితుడిని మీడియా ముందు హాజరు పర్చిన పోలీసులు

## వర్షాలతో అప్రమత్తంగా ఉండాలి

**ఎస్పీ స్నేహమెహ్రా**



**వికారాబాద్,ప్రభాతవార్త :** రాబోయే 48 గంటల పాటు జిల్లాలో భారీ నుండి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసిన నేపథ్యంలో జిల్లా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, జిల్లాలో పోలీసు అధికారులు, సిబ్బంది 24 గంటల పాటు అందుబాటులో >>2

# నత్తనడకన దొంగల వేట

**ప్రభాతవార్త, వికారాబాద్ జిల్లా ప్రతినిధి :** అంతర్ రాష్ట్ర దొంగల ముఠాను పట్టుకునేంత సాంకేతిక పరిజ్ఞానం ఉన్నా రెండు భారీ దొంగతనాల కేసు మిస్టరీ ఇంకా వీడటం లేదు. యేడాదిన్నర క్రితం తాండూరు పట్టణంలో జరిగిన సంఘటనలు తీవ్ర కలకలం సృష్టించాయి. ఇప్పటికీ దొంగల ఊఊఆచూకీ కనుగొనలేనందున సొత్తు రికవరీపై బాధితులు ఆశలు వదులుకుంటున్నారు. 2025 సంవత్సరం ఆరంభంలో తాండూరు మున్సిపల్ పరిధిలోని సాయిపూర్‌లో రైతు వెంకట్‌రెడ్డి ఇంటి తాళాలు పగులగొట్టి 40 తులాల బంగారం దోచుకున్నారు. మరుసటి రోజు ఈ సంఘటన కవరేజీకి వెళ్లిన రిపోర్టర్ బసయ్యగౌడ్ ఇంటి తాళాలు కూడా పగులగొట్టిన దొంగలు పెద్ద ఎత్తున బంగారం, డబ్బు చోరీ చేశారు. ఈ రెండు సంఘటనలలో ఒకటి రాత్రి, మరొకటి పగటిపూట సంఘటనలు జరిగాయి. తాండూరు సబ్‌డివిజన్‌కే కాకుండా జిల్లా పోలీసుశాఖకు ఈ రెండు సంఘటనలు సవాలు విసిరినట్లయింది. అప్పట్లో దొంగల వేట చురుగ్గా చేపట్టిన పోలీసులు క్రమంగా డీలా పడ్డారన్న విమర్శలు వస్తున్నాయి.

**మిస్టరీ వీడని సాయిపూర్, గ్రీన్‌సిటీ కేసులు**
**యేడాదిన్నర అవుతున్నా చిక్కని దొంగలు**
**50 తులాల బంగారం, నగదు రికవరీ సాధ్యమేనా!**

**హామీలకే పరిమితం !**



తమకు న్యాయం చేయాలంటూ బాధితులు వెంకట్‌రెడ్డి, బసయ్యగౌడ్ అనేక పర్యాయాలు పోలీసులను ఆశ్రయించారు. ఇన్‌స్పెక్టర్ స్థాయి నుంచి జిల్లా ఉన్నతాధికారుల వరకూ వెళ్లినా ఫలితం లేకపోయింది. త్వరలో దొంగలను పట్టుకుంటామని హామీ ఇస్తున్నా ఇప్పటి వరకు కేసు పరిష్కారం కాలేకపోయింది. వెంకట్‌రెడ్డి ఇంట్లో జరిగిన సంఘటనకు ఇంకా క్లూ లభించలేదని సమాచారం. గ్రీన్‌సిటీలో బసయ్యగౌడ్ ఇంట్లో జరిగిన దొంగతనానికి సంబంధించి క్లూ లభించినా నిందితుడు పోలీసులకు చిక్కడం లేదని తెలుస్తోంది. జడ్చర్లలో జరిగిన సంఘటనలో పాల్గొన్న నిందితుడి మాదిరిగా తాండూరు గ్రీన్‌సిటీలో ముసుగు ధరించిన వ్యక్తి ఫుటేజీలు లభ్యమైనాయి. ఈ రెండు సంఘటనల్లో పాల్గొన్న ముఠా అంతర్‌రాష్ట్ర దొంగలా లేక స్థానికంగా ఉండే గ్యాంగులా అనేది తేల్చాల్సి ఉన్నది.

**క్లూస్‌టీమ్ ఆధారాలు సేకరించినా..**

దొంగతనాల కేసులను ఛేధించేందుకు ఆరంభంలో క్లూస్‌టీమ్ ఆధారాలు సేకరించినా ముఠా >>2


సాయిపూర్‌లో జరిగిన దొంగతనం సంఘటన దృశాలు (ఫైల్)


అరుంధతి వెంకట్ రెడ్డి

## మహిళా నాయకత్వానికి మరో మైలురాయి

**స్త్రీనిధి బోర్డ్ డైరెక్టర్‌గా అరుంధతి - గ్రామస్థాయి నుండి జిల్లా స్థాయికి..**

**షాద్‌నగర్, జులై 30, ప్రభాతవార్త :** ఫరూక్‌నగర్ మండలం నాగులపల్లి గ్రామానికి చెందిన నాల్లపురం అరుంధతి వెంకట్ రెడ్డి రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాలకు స్త్రీనిధి బోర్డ్ ఆఫ్ డైరెక్టర్‌గా ఘన విజయం సాధించారు. ఇటీవల జరిగిన జిల్లా ఎన్నికల్లో తన సమీప ప్రత్యర్థిపై కేవలం రెండు ఓట్ల తేడాతో విజయం సాధించడం విశేషంగా నిలిచింది. ఈ విజయంతో మండల స్థాయి నాయకత్వం నుంచి జిల్లా స్థాయి బాధ్యతలకు ఆమె అడుగుపెట్టారు. ప్రస్తుతం ఫరూక్‌నగర్ మండల సమైక్య అధ్యక్షురాలిగా సేవలందిస్తున్న అరుంధతి, మహిళా సంఘాల అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తూ ప్రత్యేక గుర్తింపు పొందారు. ఆమె విజయం అనంతరం మహిళా సంఘాల సభ్యులు, ప్రజాప్రతినిధులు, సన్నిహితులు, అభిమానులు శుభాకాంక్షలు తెలియజేస్తూ అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా అరుంధతి వెంకట్ రెడ్డి మాట్లాడుతూ, తనపై విశ్వాసం ఉంచి ఓటు వేసిన ప్రతి ఓటరికి, మహిళా సంఘాల సభ్యులకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. తనకు అప్పగించిన బాధ్యతను నిబద్ధతతో నిర్వహిస్తూ, మహిళా సంక్షేమం కోసం పారదర్శకంగా, అవినీతికి తావులేకుండా సేవలు అందిస్తానని స్పష్టం చేశారు.

**అడుగడుగునా సేవా ప్రస్థానం**

అరుంధతి వెంకట్ రెడ్డి ప్రజాసేవలో తనదైన ముద్ర వేశారు. 2021లో రెడ్డి మహిళా సేవా సంఘం అధ్యక్షురాలిగా షాద్‌నగర్ నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహించారు. 2023లో నాగులపల్లి గ్రామ సంఘం అధ్యక్షురాలిగా ఎన్నికై మహిళల సమస్యల పరిష్కారానికి కృషి చేశారు. అనంతరం 2025-26 సంవత్సరానికి ఫరూక్‌నగర్ మండల సమైక్య అధ్యక్షురాలిగా >>2


జాతీయ ఎస్సీ కమిషన్‌కు ఫిర్యాదు చేస్తున్న బిజెపి నాయకులు

## 15 రోజుల్లో చర్యల నివేదిక ఇవ్వండి

**సిద్ధాపూర్ డంపింగ్ యార్డ్ వ్యవహారంపై జాతీయ ఎస్సీ కమిషన్ సీరియస్**

**సిఎస్‌కి అత్యవసర ఆదేశాలు**

**షాద్‌నగర్, జులై 30, ప్రభాతవార్త :** రంగారెడ్డి జిల్లా కొత్తూర్ మండలం సిద్ధాపూర్ గ్రామంలో ప్రతిపాదిత జీహెచ్ఎంసీ ఘన వ్యర్థాల నిర్వహణ (ఎస్.డబ్ల్యు.ఎం) కేంద్రం ఏర్పాటుపై జాతీయ షెడ్యూల్డ్ కులాల కమిషన్ (ఎన్. సీ.ఎస్.సీ) స్పందించింది. సిద్ధాపూర్ గ్రామానికి చెందిన పట్నం సురేష్ సమర్పించిన ఫిర్యాదును పరిశీలించిన కమిషన్, ఈ అంశాన్ని అత్యంత ప్రాధాన్యంగా తీసుకుని తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజూకు అధికారిక లేఖ పంపింది. ఫిర్యాదులో పేర్కొన్న అంశాల ప్రకారం, ప్రతిపాదిత డంపింగ్ యార్డ్ వల్ల షెడ్యూల్డ్ కులాల కుటుంబాలు, చిన్న రైతుల భూములు, జీవనోపాధి, ఆరోగ్యం, రాజ్యాంగ హక్కులు దెబ్బతినే అవకాశం ఉందని కమిషన్ పేర్కొంది. ఈ అంశం భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 338 పరిధిలోకి వస్తుందని స్పష్టం చేసింది. జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడు వడ్డేపల్లి రామ్‌చందర్ సంతకంతో జారీ చేసిన లేఖలో, సంబంధిత అధికారులు పూర్తి స్థాయిలో విచారణ చేపట్టి చట్టపరమైన నిబంధనలు పాటిస్తూ తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అలాగే విచారణ అనంతరం తీసుకున్న చర్యలు, సంబంధిత ఆధారాలతో కూడిన యాక్షన్ టేకెన్ రిపోర్ట్ (ఏటీఆర్)ను >>2

# పోషకాల రుచి... చదువులకు ఊపిరి

**ప్రభాతవార్త, వికారాబాద్ జిల్లా ప్రతినిధి :** ప్రభుత్వ పాఠశాలల్లో చదవుతున్న గ్రామీణ విద్యార్థుల కోసం ఇటీవల ప్రారంభించిన సీఎం అల్పాహారం, భోజన కార్యక్రమం సత్ఫలితాలిస్తోంది. తెలంగాణ ప్రభుత్వం, హరేకృష్ణ మూమెంట్ చారిటబుల్ ఫౌండేషన్ సంయుక్తంగా చేపడుతున్న విషయం తెలిసిందే. అర్ధాకలితో అలమటిస్తూ పాఠశాలకు వెళ్లలేని పరిస్థితిలో వున్న విద్యార్థులకు కార్యక్రమం ఉపయోగకరంగా మారింది. స్కూలు విద్యార్థులకు ఉదయం అల్పాహారం, ప్రభుత్వ కాలేజీ విద్యార్థులకు టిఫిన్, మధ్యాహ్నం భోజనం కూడా అందజేస్తున్నారు. ఈ కార్యక్రమం పట్ల విద్యార్థుల తల్లిదండ్రులు, హెడ్‌మాస్టర్లు, ఉపాధ్యాయులు, విద్యార్థులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

**నాణ్యతలో రాజీపడకుండా**

రుచి, శుచి, శుభ్రతేకు ప్రాధాన్యత ఇస్తున్నారు. అంతేకాదు విద్యార్థుల ఆరోగ్యంపై కూడా శ్రద్ధ చూపిస్తున్నారు. అందుకే ప్రొటీన్, విటమిన్స్, మినరల్స్ కలిగిన అల్పాహారం అందజేస్తున్నారు. ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా 23,106 పాఠశాలల్లో సుమారు 20 లక్షల మంది విద్యార్థులు లబ్ధిపొందుతున్నారు. హరేకృష్ణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 31 మెగా కిచెన్‌లను ప్లాన్ చేశారు. ప్రస్తుతం ఆరు చోట్ల ప్రారంభించారు. శుభ్రతకు ప్రాధాన్యత ఇస్తూ వంటశాలను ఎప్పటికప్పుడు శుభ్రం చేస్తుంటారు. వంట వండేవారు, కూరగాయలు తరిగేవారు శుభ్రంగా ఉండేలా నిర్వాహకులు చర్యలు తీసుకుంటున్నారు. క్రిములు, కీటకాలు దూరకుండా చర్యలు చేపట్టారు. నాణ్యతలో రాజీపడకుండా క్వాలిటీ కంట్రోల్ సిబ్బంది పగడ్బంధీగా వ్యవహరిస్తున్నారు. అత్యాధునిక ఖరీదైన యంత్ర సామగ్రి ద్వారా వంటలు చేపడుతున్నారు. గంట వ్యవధిలోనే వేల మంది విద్యార్థులకు అల్పాహారం తయారీ చేస్తున్నారు. వండిన అల్పాహారాన్ని రవాణా చేసేందుకు 1,400 వాహనాలను ఏర్పాటు చేసుకున్నారు. ఈ భారీ ప్రాజెక్టు నిర్వహణకు 5 వేల మంది సిబ్బంది పని చేయడం గమనార్హం. ప్రత్యక్షంగా, పరోక్షంగా 10 వేల మంది ఉపాధి పొందుతున్నారు.


కొడంగల్‌లో అల్పాహార పథకాన్ని ప్రారంభించిన సిఎం రేవంత్(ఫైల్)

**ఆరుచోట్ల ప్రారంభం**

కొడంగల్, వరంగల్, నార్సింగి, కంది, మహబూబ్‌నగర్, మధిరలో మెగా కిచెన్‌లు ప్రారంభించారు. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ న్యూట్రిషన్ సహకారంతో రూపొందించిన మెనూ ప్రకారం ఇడ్లీ-సాంబార్, మిల్లెట్ ఇడ్లీ-సాంబార్, దోష-చట్నీ, పూరీ-ఆలూ కుర్మా, బోండా-చట్నీ, ఉప్మా-చట్నీ అందజేస్తున్నారు. వీటిలో రోజూ ఒక రకమైన అల్పాహారాన్ని పంపిణీ చేస్తున్నారు. రోజు విడిచి రోజు పాలు సరఫరా చేస్తున్నారు.

**42 వాహనాలలో నిత్యం సరఫరా**

గత నెల సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా కొడంగల్‌లో ప్రారంభించారు. ఉదయం 6 గంటలకే అల్పాహారం సిద్ధం చేస్తున్నారు. >>2

# నత్తనడకన దొంగల వేట

(మొదటి పేజీ తరువాయి)

గురించి ఆరా తీయలేకపోయారు. ఇన్‌స్పెక్టర్ స్థాయి అధికారి నేతృత్వంలో క్రైమ్ పార్టీ సమర్థవంతంగా పని చేయాల్సిన అవసరం ఉన్నది. ఇటీవల అంతర్‌రాష్ట్ర ముఠా సభ్యులను పట్టుకున్న వికారాబాద్ పోలీసు అధికారుల బృందం తాం దూరు సంఘటనపై కూడా దృష్టి సారించాలని బాధితులు అంటున్నారు. ఇలాంటి తరహా దొంగతనాల సంఘటనలపై రాష్ట్రంలోనే కాకుండా పొరుగు రాష్ట్రాల్లో కూడా ఆరా తీస్తే కేసు పరిశోధన వేగమంతం చేసేందుకు వీలవుతుంది. దొంగల వేటకు వెళ్లే బృందానికి సరైన వసతులు కల్పించి పొరుగు రాష్ట్రాలకు పంపించాల్సి ఉంది. తాళాలు, గొళ్లాలు పగులగొట్టే ముఠా లపై నమోదైన కేసులు, వారు ప్రస్తుతం జైళ్లో ఉన్నారా, లేక బయట ఉన్నారా వంటి వివరాలు సేకరించాలి. తాండూరులో జరిగిన సంఘటనలో దొంగలు కారంపొడి చల్లి దొంగతనానికి పాల్పడ్డారు. ఇలాంటి సంఘటనలు ఏపీలోని గుంటూరు జిల్లాలో పలు సంఘటనలు జరిగినట్లు తెలుస్తోంది. ఏదేమైనా ప్రజల ప్రాణ, మానాలే కాకుండా ఆస్తులు కాపాడాల్సిన పోలీసులు ఇలాంటి సంఘటనలు జరిగినపుడు సీరియస్‌గా తీసుకోవాల్సిన అసవరం ఉన్నది.

**దొంగల వేట ఆగదు : డీఎస్పీ నర్సింగ్ యాదయ్య**

తాండూరులో నిరుడు జరిగిన రెండు దొంగతనాలపై సీరియస్‌గా తీసుకున్నాం. తమ బృందాలే కాకుండా వికారాబాద్ సీసీఎస్ విభాగం కూడా గట్టి ప్రయత్నాలు చేస్తోంది. ఇంకా దొంగల ఆచూకీ దొరకనందున గాలింపు ముమ్మరంగా కొనసాగిస్తున్నాం. ఇటీవల సీసీఎస్ బృందం ఉత్తర్‌ప్రదేశ్ కూడా వేట చేపట్టింది. ఇప్పటి వరకు తగిన సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించాం.

# మహిళా నాయకత్వానికి మరో మైలురాయి

(మొదటి పేజీ తరువాయి)

బాధ్యతలు చేపట్టి మహిళా సంఘాల బలోపేతానికి విశేష సేవలందించారు. తాజాగా జిల్లా స్త్రీనిధి బోర్డ్ ఆఫ్ డైరెక్టర్‌గా ఎన్నికై మరో కీలక మైలురాయిని చేరుకున్నారు. విజయానికి కుటుంబ సహకారమే బలం తన భర్త నల్లపురం వెంకట్ రెడ్డి అందించిన ప్రోత్సాహం, సహకారం తన విజయానికి ప్రధాన కారణమని అరుంధతి పేర్కొన్నారు. కుటుంబ సభ్యుల అండదండలతోనే ఈ స్థాయికి చేరుకోగలిగానని ఆమె భావోద్వేగంగా తెలిపారు. ఈ విజయం కేవలం అరుంధతి వ్యక్తిగత విజయమే కాకుండా, గ్రామీణ మహిళా నాయకత్వానికి, మహిళా సాధికారతకు దక్కిన గౌరవంగా స్థానికులు అభివర్ణిస్తున్నారు. జిల్లా స్థాయిలో ఆమె మరింత సమర్థవంతంగా సేవలందించి మహిళా సంఘాల అభివృద్ధికి కృషి చేస్తారనే ఆశాభావాన్ని పలువురు వ్యక్తం చేస్తున్నారు.

# 15 రోజుల్లో చర్యల నివేదిక ఇవ్వండి

(మొదటి పేజీ తరువాయి)

15 రోజుల్లోగా కమిషన్‌కు సమర్పించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించారు.

**గల్లీ నుంచి ఢిల్లీకి చేరిన రైతుల పోరాటం..**

సిద్ధాపూర్ రైతుల సమస్యను

జాతీయ స్థాయికి తీసుకెళ్లడంలో బీజేపీ షాద్‌నగర్ సీనియర్ నాయకులు నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి, అందే బాబయ్య కీలక పాత్ర పోషించారు. రైతులకు అండగా నిలిచి, వారిని ఢిల్లీకి తీసుకెళ్లి జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యులను కలిసి సమస్యను వివరించేలా సహకరించారు. వారి చొరవ, సమన్వయం ఫలితంగానే కమిషన్ వెంటనే స్పందించి రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక కోరడం ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ లేఖ ప్రతులను మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ శాఖ ప్రధాన కార్యదర్శి, జీహెచ్ఎంసీ కమిషనర్, రంగారెడ్డి జిల్లా కలెక్టర్, తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి సభ్య కార్యదర్శికి కూడా పంపినట్లు లేఖలో పేర్కొన్నారు.సిద్ధాపూర్ డంపింగ్ యార్డ్ అంశం ఇప్పుడు జాతీయ స్థాయిలో చర్చకు రావడంతో, ప్రభుత్వం తీసుకోనున్న తదుపరి చర్యలపై రైతులు, గ్రామస్తులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

**అన్ని రాజకీయ పార్టీలు ఏకం కావాలి**

సిద్ధాపూర్ డంపింగ్ యార్డ్ అంశంపై జాతీయ ఎస్సీ కమిషన్ స్పందించి రాష్ట్ర ప్రభుత్వాన్ని నివేదిక కోరడం స్వాగతించదగ్గ పరిణామమని తెలంగాణ రాష్ట్ర సహకార యూనియన్ మాజీ చైర్మన్ రాజా వరప్రసాద్ అన్నారు. ఈ విషయంలో రైతులకు అండగా నిలిచి, వారిని ఢిల్లీకి తీసుకెళ్లి జాతీయ ఎస్సీ కమిషన్ దృష్టికి సమస్యను తీసుకెళ్లిన బీజేపీ షాద్‌నగర్ సీనియర్ నాయకులు అందె బాబయ్య, నెల్లి శ్రీవర్ధన్ రెడ్డిలకు ఆయన శుభాభినందనలు తెలిపారు. అయితే, డంపింగ్ యార్డ్ ఏర్పాటుకు కారణమైన జి.వో. నం.641ను కాంగ్రెస్ ప్రభుత్వం జారీ చేసిందని పేర్కొంటూనే, జాతీయ స్థాయిలో "కాంగ్రెస్ ముక్త్ భారత్" అనే నినాదం ఇచ్చే బీజేపీ, తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వంపై అదే స్థాయిలో ఎందుకు పోరాటం చేయడం లేదని ఆయన ప్రశ్నించారు. అలాగే, సిద్ధాపూర్ డంపింగ్ యార్డ్ వ్యతిరేకంగా జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉద్యమ కార్యక్రమాల్లో పాల్గొనవద్దని స్థానిక బీజేపీ నాయకులు, కార్యకర్తలకు పార్టీ జిల్లా అధ్యక్షుడు సూచించారనే ప్రచారం నిజమేనా అని ప్రశ్నించారు. ఏదేమైనా, సిద్ధాపూర్ డంపింగ్ యార్డ్ రద్దు దిశగా ఒక కీలక ముందడుగు పడేందుకు కృషి చేసిన అందె బాబయ్య, నెల్లి శ్రీవర్ధన్ రెడ్డిలను మరోసారి అభినందిస్తున్నానని, ఇకపై డంపింగ్ యార్డ్ వ్యతిరేక ఉద్యమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు ప్రత్యక్షంగా పాల్గొని రైతులకు అండగా నిలవాలని రాజా వరప్రసాద్ విజ్ఞప్తి చేశారు.

# అభివృద్ధిలో రాజకీయాలొద్దు

(మొదటి పేజీ తరువాయి)

సభలో అధికారుల దృష్టికి తెచ్చారు. ఈ కార్యక్రమంలో ఇన్చార్జి ఎంపిఓ చక్రధర్ గౌడ్, హౌసింగ్ డిఇ సురేష్, సర్పంచులు కొమ్ము కృష్ణ, గడ్డల మంజుల యాదగిరి, గబ్రు చౌహన్, సి మల్లేష్, రాజేశ్వరి శ్రీనివాస్, బుగ్గ సాలయ్య, జట్ట కుమార్, జెట్టా పాండు, జట్ట లావణ్య, కుమ్మరి కృష్ణ, ఆయా శాఖల అధికారులు, మండల మాజీ ఎంపీపీ ఎం శివశంకర్ గౌడ్, మండల పార్టీ అధ్యక్షుడు దేపల్లె కుమార్ గౌడ్, మాజీ అధ్యక్షుడు జంగ నరసింహులు, రంగాపూర్ కాంగ్రెస్ నేత గోవు రవికుమార్ తదితరులు పాల్గొన్నారు. మండల స్థాయి సమీక్ష సమావేశానికి హాజరైన ఎమ్మెల్యేను ఎంపీడీవో అరుంధతి ఆధ్వర్యంలో అధికారులు, ప్రజాప్రతినిధులు ఘన స్వాగతం పలికారు. రంగారెడ్డి జిల్లా జడ్పీ సీఈవో కృష్ణారెడ్డి పుష్ప గుచ్చం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఇన్చార్జి ఎంపిఓ చక్రధర్ గౌడ్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు దేపల్లె కుమార స్వామి గౌడ్, నందిగామ సర్పంచ్ కొమ్ము కృష్ణ, సిడితాండ సర్పంచ్ గబ్రు చౌహన్, ఏఎంసి డైరెక్టర్ సి నర్సింలు తదితరులున్నారు.

# జంట జలాశయాలకు వరద పోటు

**హైదరాబాద్, జులై 30, ప్రభాతవార్త**

ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో జలాశ యాలకు వరద పోటెత్తుతోంది.నగరానికి ప్రధాన తాగునీటి వనరులైన హిమాయత్‌సాగర్, ఉస్మాన్ సాగర్ జలాశయాల్లోకి భారీగా నీరు వచ్చి చేరు తోంది. రెండు రోజులుగా జంటజలాశయాల ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న మోస్తరు వర్షాల కారణంగా గురువారం ఉదయం నుంచి హిమా యత్‌సాగర్, ఉస్మాన్‌సాగర్ జలాశయాలకు తాజా వరద నీటి ప్రవాహాలు ప్రారంభమయ్యాయి. అనంతగిరి, చేవెళ్ల, నాదర్‌గూడ, వెంకటాపురం తదితర ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న వరద తో హిమాయత్‌సాగర్ జలాశయం నిండుకుండలా మారుతోంది. హిమాయత్‌సాగర్ జలాశయానికి 400 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదవుతోంది.

# ఆహా! వచ్చిందయ్యా భరోసా



గండి పడటంతో వృథా అవుతున్న జుంటుపల్లి ప్రాజెక్టు నీరు

(మొదటి పేజీ తరువాయి)

పంటలు, కూరగాయలు పండిస్తారు. చెరుకు పంట కూడా ఆశాజనకంగా ఉంటుందని రైతులు అంటున్నారు. కోటపల్లి మధ్యతరహా ప్రాజెక్టులోకి ఏకంగా 20 అడుగుల మేరకు నీరు చేరింది. దీని పూర్తిస్థాయి సామర్థ్యం 24 అడుగులు ఉండగా రేపో, మాపో అలుగు మీదుగా నీరు ప్రవహించవచ్చని భావిస్తున్నారు. ఈ ప్రాజెక్టు కింద 9200 ఎకరాల ఆయకట్టు భూములు ఉన్నాయి. ఇటీవల రూ.84 కోట్ల వ్యయంతో ప్రాజెక్టు ఆధునీకరణ పనులు చేపట్టిన విషయం తెలిసిందే. సీఎం రేవంత్, స్పీకర్ ప్రసాద్, ఎమ్మెల్యే మనోహర్ కృషి ఫలితంగా మరమ్మతులు చేపడుతున్నారు. ఇప్పటి వరకు 80 శాతం పనులు పూర్తి చేశారు. కాల్వల పునర్ నిర్మాణం పనులు దాదాపు చివరి దశకు చేరుకున్నాయి. అక్టోబరు మాసంలో యాసంగి పంటలు వేసుకునేందుకు సరిపడా నీరు చేరాయి. ప్రాజెక్టులోకి 12 అడుగుల వరకు నీరు చేరితే చాలు యాసంగి పంటలు వేసుకోవచ్చని ఇరిగేషన్ అధికారులు చెబుతున్నారు. యాసంగిలో ప్రాజెక్టు కింద 15 గ్రామాల రైతులు వరి, వేరుశనగ, శనగ పంటలు పండిస్తారు.

**జుంటుపల్లి గండికి గ్రహణం**

యాలాల మండలం జుంటుపల్లి ప్రాజెక్టుకు రెండేళ్ల క్రితం గండి పడటంతో నీరంతా వృథాపోతోంది. దీని కింద 2 వేల ఎకరాల భూములున్నాయి. రూ.4.5 కోట్ల వ్యయంతో తూముకు పడిన గండి నిర్మించేందుకు నిధులు విడుదల చేశారు. కానీ కాంట్రాక్టర్ పనులు చేపట్టలేకపోయారు. రైతులు ప్రాజెక్టు కింద బోర్లు వేసుకుని వరి ధాన్యం పండిస్తున్నారు. తూము పునర్ నిర్మాణం పూర్తయితే రైతులకు మేలు చేకూరుతుంది. ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి కాగ్నా, కాకరవేణి నదుల్లోకి పుష్కలంగా వరదనీరు చేరింది.

ఈ నదులపై నిర్మించిన చెక్‌డ్యామ్‌లు ఓవర్‌ఫ్లో అవుతున్నాయి. దీనివల్ల కాగ్నా చుట్టూ ఐదు కిలోమీటర్ల దూరంలో భూగర్భజలాలు పెరుగనున్నాయి. రానున్న వేసవిలోనూ మంచినీటి ఎద్దడిని అధిగమించేందుకు వీలవుతుంది. మోమిన్‌పేట వద్ద గల నందివాగు ప్రాజెక్టు, ధారూరు వద్ద సర్పన్‌పల్లి ప్రాజెక్టు, పరిగి మండలంలోని లఖ్నాపూర్ ప్రాజెక్టులకూ భారీగా వరదనీరు చేరుతోంది.

# నిండు కుండలా నందివాగు ప్రాజెక్టు

**మోమిన్‌పేట్,జులై 30, ప్రభాతవార్త:** ఇటీవల కురుస్తున్న ఏకదాటి వర్షాలకు మోమిన్‌పేట్ నందివాగు ప్రాజెక్టు నిండు కుండలా ప్రవహిస్తోంది. అందులో బాగంగా రాళ్ళగుడుపల్లి పెద్దవాగు అలుగు పూర్తిగా నిండిపోయి ప్రవహిస్తోంది. మోమిన్‌పేట్ నందివాగు ప్రాజెక్టు మాత్రం 16, ఫీట్లకు గాను 13, ఫీట్లు నిండిందని, ఇంకో 3, ఫీట్లు నీరు పెరిగిగితే పూర్తి అలుగు ప్రవహించడం జరుగుతుందని సంబందిత అధికారులు తెలిపారు. ఇటీవల కురుస్తున్న వర్షాల నేపద్యంలో ఇంకా రెండు మూడు రోజులలో నందివాగు ప్రాజెక్టు పూర్తిగా అలుగుపై నుండి ప్రవహించే అవకాశం ఉందని అంచనా వేశారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలు ఇలానే కురిస్తే వచ్చే మూడు రోజుల్లో నందివాగు అలుగుపై నుండి ప్రవహిండం జరుగుతుందని తెలిపారు. మోమిన్‌పేట్ నందివాగు ప్రాజెక్టు అలుగుపై నుండి నీరు ప్రవహిస్తే ప్రాజెక్టు కింద ఉన్న గ్రామాలు, కొండాపూర్ మండలం అనంతసాగర్ వరకు సాగునీరుకు కొదవ ఉండదని అధికారులు అంచనా వేసి చెబుతున్నారు.

**ప్రజలు అప్రమత్తంగా ఉండాలి**

ఇటీవల కురుస్తున్న భారీ వర్షాల నేపద్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మోమిన్‌పేట్ తహశిల్దార్ మునీరొద్దీన్, ఎస్ఐ భరత్ భూషణ్ పేర్కొన్నారు. గురువారం వారు మోమిన్‌పేట్ నందివాగు ప్రాజెక్టును సంధర్శించిన సంధర్భంగా వారు మాట్లాడుతు లోతట్టు ప్రాంతాలలో అధిక నీరు ప్రవహించడంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ సందర్బంగా చిలుకవాగు, నందివాగు ప్రాజెక్టు, రాళ్లగుడుపల్లి పెద్దవాగు నీటి ప్రవాహం పెరగడం కారణంగా ప్రజలు జాగ్రతగా ఉండాలని అన్నారు. అత్యవసరమైతే కూడా నీటి ప్రవాహం ఉన్నపుడు వాగులు, వంకలు, చెరువుల వద్దకు వెళ్లకూడదని తెలిపారు. నీరు ప్రవహిస్తున్న సమయంలో పశువులు గాని, ప్రజలు గాని దాటడానికి ప్రయత్నించకూడదని అన్నారు. తప్పని పరిస్థితలో గనుక వెళ్ళాల్సి ఉంటే నీరు ప్రవహించడం తగ్గిన తర్వాత వెళ్ళాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల రెవెన్యూ తహశిల్దారు మునీరొద్దీన్, ఎస్ఐ భరత్ భూషణ్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

**కోట్‌పల్లిలో ..**

**కోట్‌పల్లి, జులై 30, ప్రభాతవార్త :** ఏడతేరపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలందరు అప్రమత్తంగా ఉండాలని కోట్‌పల్లి ఎస్సై శైలజ అన్నారు. గురువారం నాడు వికారాబాద్ జిల్లా కోట్‌పల్లి మండలంలోని కోట్‌పల్లి, మరియు కంకణాలపల్లి గ్రామంలో ఉన్న వాగును అమె పరిశీలించారు. ఈసందర్బంగా అమె మాట్లాడుతూ. వర్షాల కారణంగా వాగులు, వంకలు ఉప్పొంగే అవకాశం ఎక్కువ ఉందని ఎట్టి పరిస్థితుల్లోనూ వాగులు దాటేందుకు ఏవరు కుడా ప్రయత్నించ వద్దని అమె హెచ్చరించారు.అదే విధంగా విద్యుత్తు స్థంబాల వద్ద ఏవరు కుడా నిలిచి ఉండవద్దన్నారు. అదే విధంగా అత్యవసర పరిస్థితులు మినహా ప్రజలు ఇళ్లలోనే ఉండాలన్నారు. కూలిపోయే ఇంట్లో కుడా ఉండవద్దన్నారు. సురక్షితంగా ప్రజలందరూ ఉండాలని, తల్లిదండ్రులు చిన్నారులను వాగులు, చెరువుల వద్దకు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. రైతులు కూడా వ్యవసాయ పనులకు వెళ్ళే సమయంలో వాతావరణ పరిస్థితులను గమనించాలని ఏదైనా అత్యవసర పరిస్థితి ఏర్పడితే తప్పా బయటకు రావద్దని అమె పేర్కొన్నారు.



రాళ్లగుడుపల్లి పెద్దవాగు నుంచి ప్రవహిస్తున్న వరద నీరు



నందివాగు ప్రాజెక్టును పరిశీలిస్తున్న ఎంఆర్ఓ, ఎస్ఐ



కోట్‌పల్లి బ్రిడ్జిని పరిశీలిస్తున్న ఎస్ఐ శైలజ

# భారీ వర్షానికి అప్రోచ్ రోడ్లు గల్లంతు

**తవికారాబాద్,ప్రభాతవార్త :** జిల్లాలో గత రెండు రోజులుగా జల్లులతో కూడిన వర్షం కురుస్తుంది. బుధవారం రాత్రి నుంచి గురువారం సాయంత్రం వరకు జడివాన కురిసింది. దీంతో జిల్లాలో ఉన్న వాగుల్లో వరద నీరు కాస్తా ఉధృతంగా ప్రవహించాయి. జిల్లాలోని కోటపల్లి ప్రాజెక్టు, లక్నాపూర్, జుంటుపల్లి ప్రాజెక్టులకు జలకళ సంతరించుకున్నాయి. కోటపల్లి ప్రాజెక్టు నీటి సామర్థ్యం 24 అడుగులు ఉండగా, ప్రస్తుతం 20 అడుగులకు చేరుకుంది. మరో 4 అడుగులు వరద నీరు వచ్చి చేరితే..ముత్తడి పారే అవకాశం ఉంది. వికారాబాద్-నస్కల్ పరిగి రోడ్డులో మద్గుల్‌చిట్టంపల్లి వద్ద కల్వర్టు నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. కురిసిన వర్షానికి కల్వర్టు వద్ద ఉన్న అప్రోచ్ రోడ్డు కొట్టుకుపోవడంతో కొన్ని గంటల పాటు వికారాబాద్-పరిగి రాకపోకలు నిలిచిపోయాయి.

విషయం తెలుసుకున్న వికారాబాద్ సీఐ రఘుకుమార్, స్థానిక కౌన్సిలర్ సహకారంతో అప్రోచ్ రోడ్డు పనులు చేపట్టి రాకపోకలు పునరుద్దరించారు. అవసరం అయితే కానీ బయటకి రావొద్దని అధికారులు సూచనలు చేస్తున్నారు.



వాగుల వద్ద పోలీస్ పహారా



మద్గుల్‌చిట్టంపల్లి వద్ద తెగిన అప్రోచ్ రోడ్డు



పనులు చేపడుతున్న ప్రజాప్రతినిధులు

# ఊరూరా స్వేచ్ఛా రథం

(మొదటి పేజీ తరుహాయి)

కల్పిస్తేనే మళ్లీ దోపిడీకి గురికాకుండా ఉంటారని స్పష్టం చేశారు. నేషనల్ డైరెక్టర్ మెర్లిన్ ఫ్రీడా మాట్లాడుతూ అప్పుల పేరుతో ఎవరి స్వేచ్ఛను కొనలేరని, అమ్మలేరని.. 1976 చట్టం తెగేసి చెప్పిందని గుర్తుచేశారు. ఇటుక బట్టీలు, రాతిగనులు, రైస్ మిల్లుల్లో ఇప్పటికీ సాగుతున్న దోపిడీపై పోరాడాలని పిలుపునిచ్చారు.

ఈ సదస్సులో వెట్టిచాకిరి నుండి విముక్తి పొందిన దాదాపు 380 మంది బాధితులు పాల్గొన్నారు. వెట్టిచాకిరి నుండి బయటపడి, నేడు అమరగిరి గ్రామ పంచాయతీ సర్పంచ్‌గా సేవలు అందిస్తున్న లింగమ్మ తన ఆవేదనను, పోరాట ప్రయాణాన్ని వివరించి అందరినీ ఆకట్టుకున్నారు. అలాగే బాధితురాలి నుండి జిల్లా సమాఖ్య మహిళా సంఘ నేతగా ఎదిగిన శివ్వమ్మ అనుభవాలు సదస్సులో స్ఫూర్తిని నింపాయి. కార్యక్రమంలో భాగంగా 50 ఏళ్ల స్మారక పుస్తకం, హెల్ప్‌లైన్ పోస్టర్, మరియు వెట్టిచాకిరి విముక్తి గీతం సీడీలను అతిథులు ఆవిష్కరించారు. తెలంగాణ ప్రభుత్వ సాంస్కృతిక సలహా కమిటీ సభ్యులు పల్లె నరసింహ ఆలపించిన అవగాహన గీతం సదస్సులో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. సమాజంలో శ్రమ దోపిడీ లేని తెలంగాణను నిర్మించేందుకు అధికారులు, పౌర సమాజం కలిసి ముందడుగు వేయాలని సదస్సు తీర్మానించింది.

# విద్యార్థుల ఆరోగ్యంపై దృష్టి సారించండి

(మొదటి పేజీ తరువాయి)

శామీర్‌పేట మండలంలోని తుర్కపల్లిలోని మహాత్మాజ్యోతిబా పూలే బిసి వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్‌ను, బాలుర వసతి గృహాన్ని ఆయన తనిఖీ చేశారు. నర్సింగ్ అధికారి నిర్వహిస్తున్న ఆరోగ్య రికార్డులు, మందుల లభ్యత, వంట శాల(కిచెన్), వసతి గృహంలో పారిశుద్య పరిస్థితితులను పరిశీలించారు. విద్యార్థులకు అందిస్తున్న ఆహారం నాణ్యతను స్వయంగా డిఎంఅండ్‌హెచ్ఓ డాక్టర్ కె.ఆనంద్ పరిశీలించారు. కూరగాయల నాణ్యత, నిల్వ విధానం, పరిశుభ్రత ప్రమాణాలను ఆయన తనిఖీలు చేశారు. విద్యార్థులకు అందించే ఆహారం తాజాగ పోషక విలువలతో కూడినదిగా ఉండేలా నిరంతరం పర్యవేక్షణ చేయాలని సంబంధిత సిబ్బందికి ఆయన సూచించారు. తనిఖీలో విద్యార్థులకు అందించాల్సిన గుడ్ల నిల్వ పూర్తిగ లేకపోవటాన్ని గమనించి సంబంధిత అధికారుల దృష్టికి ఈ విషయాన్ని తీసుకవెళ్లి విద్యార్థులకు ప్రభుత్వం నిర్దేశించిన పోషకాహారంలో ఎలాంటి అంతరాయం లేకుండా అందేలా తక్షణ చర్యలు తీసుకోవాలని ఆయన స్పష్టం చేశారు. వసతి గృహం సామర్థ్యం 783మంది విద్యార్థులకు ఉండగా, ప్రస్తుతం 679మంది విద్యార్థులు నివాసం ఉంటున్నట్లు పరిశీలనలో తేలింది. విద్యార్థులకు అందించే ఆహారంలో నాణ్యత, పరిశుభ్రత, వంటశాల నిర్వాహణ, కూరగాయలు, ఇతర ఆహర పధార్థాల పరిశుభ్రతను పాటించాలని సూచించారు. విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని, అవసరమైతే ఆర్‌బిఎస్‌కె వైద్య బృందాలను వసతి గృహాలకు పంపించి ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తామని, లేదా విద్యార్థులను సమీప తుర్కపల్లి పిహెచ్‌సి, శామీర్‌పేట హాస్పిటల్‌లకు తీసుకవచ్చి వైద్య పరీక్షలు నిర్వహించేలా చర్యలు చేపట్టాలని అధికారులకు,సిబ్బందికి సూచించారు. సంబంధిత అధికారులు సమన్వయంతో ఉంటూ విద్యార్థుల ఆరోగ్యం, సంక్షేమంపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలని డిఎంఅండ్‌హెచ్ఓ డాక్టర్ కె.ఆనంద్ ఆదేశించారు.

# అప్రమత్తంగా ఉండండి

(మొదటి పేజీ తరువాయి)

ఉండి ప్రజలకు అవసరమైన సహాయ సహకారాలు అందించాలని ఆదేశించారు. ప్రతి పోలీస్ స్టేషన్‌లో అత్యవసర పరిస్థితులకు వెంటనే స్పందించేలా ముందస్తు ఏర్పాట్లు చేయాలని సూచించారు. రెవెన్యూ, అగ్నిమాపక, వైద్య, పంచాయతీరాజ్ తదితర శాఖలతో నిరంతర సమన్వయం కొనసాగించాలని ఆదేశించారు. అంబులెన్సులు, వైద్యులు, సహాయక బృందాలు సిద్ధంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. వాగులు, వంకలు, చెరువులు, ప్రాజెక్టులు ఉధృతంగా ప్రవహిస్తే ప్రజలు ఎట్టి పరిస్థితుల్లోనూ దాటేందుకు ప్రయత్నించవద్దని హెచ్చరించారు. అత్యవసరం అయితే తప్ప బయటకు రావద్దని, పిల్లలను నీటి ప్రవాహాల వద్దకు వెళ్లనివ్వవద్దని సూచించారు. పాత ఇండ్లలో నివసించే కుటుంబాలు సురక్షిత ప్రాంతాలకు తరలాలని, శిథిల భవనాలు, చెట్లు, విద్యుత్ స్తంభాల సమీపంలో ఉండవద్దని తెలిపారు. రోడ్లపై నీరు నిల్వ ఉండటం, గుంతలు కనిపించకపోవడం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నందున వాహనదారులు నెమ్మదిగా, జాగ్రత్తగా ప్రయాణించాలని తెలిపారు. గ్రామ సర్పంచ్‌లు, ఇతర శాఖల అధికారులతో కలిసి వరద పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని పేర్కొన్నారు. ప్రమాదకర వాగులు, కల్వర్టులు, వరద ముంపు ప్రాంతాల వద్ద రోడ్డు బ్లాక్‌లు ఏర్పాటు చేసి ప్రజలకు అవగాహన కల్పించాలని ఎస్పీ తెలిపారు. క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ ప్రమాదకర ప్రాంతాలను గుర్తించడం, ట్రాఫిక్ మళ్లించడం, సహాయక చర్యలు చేపట్టాలని ఆదేశించారు.ప్రజల ప్రాణాలు, ఆస్తుల రక్షణకు జిల్లా పోలీసు యంత్రాంగం పూర్తిస్థాయిలో సిద్ధంగా ఉందని ఎస్పీ స్పష్టం చేశారు. అత్యవసర సహాయం, అత్యవసర పరిస్థితుల్లో వెంటనే డయల్-100 లేదా వికారాబాద్ జిల్లా పోలీస్ కంట్రోల్ రూమ్ 8712670056 ఫోన్ నెంబర్లకు సమాచారం అందించాలని ఎస్పీ తెలిపారు.



గిరిజనులతో కలిసి వేడుకలో పాల్గొన్న అలియాబాద్ మున్సిపల్ చైర్మన్ కె.శిరీషకృష్ణారెడ్డి తదితరులు

# ఘనంగా తీజ్ పండుగ

**శామీర్‌పేట, జులై 30, ప్రభాతవార్త :** తుర్కపల్లిలోని తండా గ్రామంలో తీజ్ పండుగను గిరిజనులు ఘనంగా జరుపుకున్నారు. గురువారం శామీర్‌పేట మండలం అలియాబాద్ మున్సిపల్ పరిధిలోని తుర్కపల్లి తండా గ్రామంలో కౌన్సిలర్ వెంకటేశ్‌నాయక్ ఆద్వర్యంలో గ్రామంలో తీజ్ పండుగ ఘనంగా జరిగింది. ఈ తీజ్ పండుగ వేడుకల్లో అలియాబాద్ మున్సిపల్ చైర్మన్ కె.శిరీషకృష్ణారెడ్డి, వైస్‌చైర్మన్ కె.మాలతిమాదవరెడ్డి, కౌన్సిలర్ వెంకటేశ్‌నాయక్, పలువురు నాయకులు పాల్గొన్నారు. గిరిజన మహిళలు తీజ్ పండుగ సందర్భంగా ఆటపాటలతో వేడుకలలో పాల్గొన్నారు. ఆ తరువాత ఈ తీజ్ పండుగ వేడుకల్లో పలువురు కౌన్సిలర్లు (బిఆర్ఎస్, బిజెపి, ఇండిపెండెంట్) జి.వెంకటేశ, కె.గణేశ్,ఎండి యూసుప్‌బాబ, లాల్‌గడిమలకపేట్ మాజీ సర్పంచు సి.శ్రీనివాస్‌రెడ్డి, పలువురు నాయకులు, గిరిజన సోదరులు, మహిళలు పాల్గొన్నారు. గిరిజనులు సాంప్రదాయ దుస్తులతో ఆటపాటలతో తీజ్ పండుగను ఘనంగా జరుపుకున్నారు.

# పోషకాల రుచి..చదువులకు ఊపిరి



అల్పాహారం సిద్ధం చేస్తున్న వంట సిబ్బంది

(మొదటి పేజీ తరువాయి)

ఉదయం 8.30 గంటల వరకు హరేకృష్ణ వాహనాలు అల్పాహారం బాక్సులతో పాఠశాలలకు చేరుకుంటాయి. ప్రిన్సిపాల్స్, హెడ్‌మాస్టర్ల సమక్షంలో విద్యార్థులకు వేడివేడి అల్పాహారం అందజేస్తారు. విద్యార్థుల హాజరుశాతం గణనీయంగా పెరిగింది. నిరుడుతో పోల్చుకుంటే ఈ విద్యా సంవత్సరం అదనంగా 10 శాతం విద్యార్థులు పాఠశాలల్లో చేరినట్లు సమాచారం. జిల్లాలో 670 స్కూళ్లకు 12 జూనియర్ కాలేజీలకు అల్పాహారం సరఫరా అవుతోంది. ఈ జిల్లాలో 52 వేల మంది విద్యార్థులు సద్వినియోగం చేసుకుంటున్నారు. వారిలో 3200 మంది కాలేజీ విద్యార్థులు కూడా ఉన్నారు. వారికి అదనంగా మధ్యాహ్న భోజనం అందజేస్తున్నారు. జిల్లాలోని కొడంగల్, పరిగి, తాండూరు, దౌల్తాబాద్, దుద్యాల, బొంరాస్‌పేట, దోమ, కులకచర్ల, బషీరాబాద్, యాలాల మండలాలతో పాటు నారా యణ పేట జిల్లా పరిధిలోకి వచ్చే కోస్గి, గుండుమాల్, కొత్తపల్లి, మద్దూరు కలిపి 14 మండలాలకు 42 వాహనాలలో రోజూ అల్పాహారం సరఫరా జరుగుతోంది.

**ప్రభుత్వ భాగస్వామ్యం ఇలా..**

హరేకృష్ణ మూమెంట్ చారిటబుల్ ఫౌండేషన్ చేపడుతున్న మంచి కార్యక్రమానికి తెలంగాణ ప్రభుత్వం సహకారం అందజేస్తోంది. విద్యార్థుల ఖర్చులో ప్రభుత్వం కూడా భరిస్తోంది. అది ఎలాగంటే.. అల్పాహారం కోసం ఒకటి నుంచి 5వ తరగతి విద్యార్థి తలకి రూ.11.50, ఆరు నుంచి పదో తరగతి విద్యార్థికి రూ.13.50 ఖర్చు చేస్తోంది.



చిట్టిఘనాపూర్‌లో అల్పాహారం అందిస్తున్న హెచ్ఎం

**భేషుగ్గా ఉంది**

**జీ.నర్సిరెడ్డి,హెచ్ఎం చిట్టిఘనాపూర్**

ఇంతటి మంచి కారక్రమం విద్యార్థులకు చాలా ఉపయోగపడుతోంది. ఈ రోజు జరిగిన గ్రామసభలో కూడా విద్యార్థుల తల్లిదండ్రులు ఉన్నతాధికారుల ముందు సంతోషం వ్యక్తం చేశారు. ప్రభుత్వం, హరేకృష్ణ పౌండేషన్‌ను అభినందిస్తున్నారు. వాహనాలు ఉదయం 8.30 గంటలకే పాఠశాలకు చేరుకుంటున్నాయి. మా సమక్షంలో విద్యార్థులకు అందజేస్తున్నాం.

జూనియర్ కాలేజీ విద్యార్థికి అల్పాహారానికి రూ.13.50, లంచ్‌కి రూ.19.85, రోజు విడిచి రోజు సరఫరా చేసే పాల కోసం రూ.1.08 కూడా అందజేయడం గమనార్హం.

**చాలా సంతోషంగా ఉన్నాం : నిశ్విత, ఐదో తరగతి చిట్టిఘనాపూర్**

ఉదయం అల్పాహారం చాలా బాగుంది. రుచికరంగా ఉంటున్నది. మేము చాలా సంతోషంగా ఉన్నాం. ఈ కార్యక్రమం ఎప్పటికీ కొనసాగుతూనే ఉండాలి.



అల్పాహారం బాక్సులు

# గణేష్ విగ్రహాలు 16 అడుగులకే పరిమితం

## ఉత్సవ కమిటీలకు సిపి సజ్జనార్ దిశానిర్దేశం

**హైదరాబాద్, జులై 30, ప్రభాతవార్త**

రాబోయే గణేష్ ఉత్సవాలను ప్రశాంతంగా, సురక్షితంగా, పర్యావరణహితంగా నిర్వహించేం దుకు పోలీస్ విభాగం ముందస్తు సన్నద్ధతను వేగవంతం చేసింది. ఇప్పటికే భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి ప్రతినిధులతో భేటీ అయిన ఉన్న తాధికారులు..తాజాగా విగ్రహ తయారీదారులతో సమన్వయ సమీక్ష నిర్వహించారు. గురువారం టీజీఐసీసీసీలో జరిగిన సమావేశలో సీపీ సజ్జనర్ మాట్లాడుతూ విగ్రహాల ప్రతిష్టాపన నుంచి శోభా యాత్ర, నిమజ్జనం వరకు ఎలాంటి అవాంఛ నీయ సంఘటనలు జరగకుండా ముందస్తు భద్ర తా చర్యలు తీసుకోవడం అత్యంత ఆవశ్యకమని స్పష్టం చేశారు. గత ఏడాది నగర కమిషనరేట్ పరిధిలో దాదాపు 23 వేల విగ్రహాలను ప్రతిష్టిం చారని, అయితే రవాణా సమయంలో నాలుగు ప్రమాదాలు చోటుచేసుకున్నాయని గుర్తుచేసిన ఆయన, ఈసారి అటువంటి పొరపాట్లకు తావులే కుండా తయారీ దశ నుంచే పక్కా భద్రతా నిబం ధనలు పాటించాలని సూచించారు. భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి ప్రతినిధులతో చర్చించిన మేరకు విగ్రహాల గరిష్ఠ ఎత్తును 16 అడుగులకే పరిమితం చేయాలన్నారు. కళాకారులు సామాజి క బాధ్యతతో మట్టి విగ్రహాల వాడకాన్ని ప్రోత్స హించాలని, భక్తులు కూడా సులభంగా నిమజ్జనమయ్యే చిన్న విగ్రహాల వైపు మొగ్గు చూపేలా అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. విగ్రహాల తయారీ వర్క్‌షాప్‌లలో ఎలాంటి అగ్నిప్రమాదా లు జరగకుండా ఫైర్ సేఫ్టీ చర్యలు తీసుకోవాలన్నారు.

